
ప్రజాశక్తి
శుక్రవారం 12 జనవరి 2024
5
పార్వతీపురం మన్యం



సమ్మె విరమణ తాత్కాలికమే

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపల్ కార్మికుల సమ్మె విరమణ తాత్కాలికమేనని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి ఎన్వైనాయుడు చెప్పారు. గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కార్మికులనుద్దేశించి ఆయన మాట్లాడుతూ సమ్మె విరమించినా హామీలకు సంబంధించిన జీవోలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే మళ్లీ సమ్మె కు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టి.శంకరరావు, టి.రాముడు, పోలరాజు, ఇందు స్వప్న పాల్గొన్నారు.



ధాన్యాన్ని ట్రాక్టర్‌పై మిల్లుకు తరలిస్తున్న రైతులు

ఆగని దోపిడీ

- అక్కరకురాని అధికారులు
- కంటతడి పెడుతున్న ధాన్యం రైతులు
- కలెక్టర్‌కు ఫిర్యాదుల వెల్లువ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో ధాన్యం క్రయ, విక్రయాల్లో దోపిడీ ఆగడం లేదు. తూకంలో తేడా, ధరలో దగా షరా మామూలుగా సాగుతోంది. దోపిడీని అరికట్టి రైతులకు బాసటగా నిలవాల్సిన ఉన్నతాధికారులు తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారు. కొన్నిచోట్ల మిల్లర్లకు వంతపాడుతున్న సందర్భాలూ తారసపడుతున్నారు. దీంతో, తమకు జరుగుతున్న అన్యాయాన్ని ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక ధాన్యం రైతులు కంటతపడి పెడుతున్నారు. కాస్తంత చొరవ ఉన్నవారు కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఫిర్యాదులు చేశారు. ప్రతి ధాన్యపు గింజా దళారుల ప్రమేయం లేకుండా కొనుగోలు చేస్తామంటూ ఇటు అధికారులు, అటు ప్రభుత్వం ప్రగల్భాలాలు పలికిన సంగతి తెలిసిందే. ఈ మాటలు కోటలు దాటుతున్నా ఆచరణ మాత్రం గడపదాటడం లేదు.

- గంట్యాడ మండలం బుడతనాపల్లికి చెందిన చల్లా రామునాయుడు కౌలు రైతు. అదే మండలంలోని కనక దుర్గ రైస్ మిల్లుకు 140 బస్తాలు, శ్రీరాధా కృష్ణ ఆగ్రో ఫుడ్స్‌కు 90 బస్తాలు, వెంకటరమణ రైస్‌మిల్లుకు 136 చొప్పున మొత్తం 366 ధాన్యం బస్తాలు విక్రయించాడు. ప్రతి బస్తాలోనూ 42 కేజీల చొప్పున తూకం వేసి, లెక్క మాత్రం 40కేజీలకే కట్టారు. ఈ ఏడాది ప్రభుత్వం నిర్ణయించిన మద్ధతు ధర 40కేజీల బస్తా ధాన్యం 'ఎ'గ్రేడ్ రూ.881.20, సాధారణ రకం రూ.873.20 గా ఉంది. కేజీ సుమారు రూ.22 చొప్పున లెక్కిస్తే రామునాయుడు వద్ద 366 బస్తాలపై ఆయా మిల్లుల యాజమాన్యాలు రూ.8.062 వరకు దోచుకున్నట్టుగా అర్థమౌతోంది. మిల్లు యాజమాన్యాలు తనను నిండా ముంచేశాయంటూ రామునాయుడు ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు.

- జామి మండలం తానవరం గ్రామానికి చెందిన సిరికి చంద్రరావు స్థానిక సూర్యరాజా రైస్ మిల్లుకు 6టన్నుల 240కేజీల ధాన్యాన్ని విక్రయించాడు. మిల్లు యాజమాన్యం, ప్రభుత్వ సిబ్బంది చూపుతున్న లెక్క మాత్రం 6టన్నులే. దీన్నిబట్టి టన్నుకు 4కేజీల చొప్పున మినహాయించినట్టు స్పష్టమౌతోంది. ఇదేం అన్యాయం అంటూ మిల్లు యాజమాన్య సిబ్బంది, అక్కడి కస్టోడియన్ ఆఫీసర్లను అడిగితే అందరి వద్దా 2కేజీల నుంచి 4కేజీల వరకు అదనంగా తీసుకుంటారని, తరుగు ఉంటుంది కాబట్టి ఆమాత్రం తప్పదని చెప్పారు. అంతే కాదు. ధాన్యం మొత్తం ఒకేసారి నూర్పుచేసి, ఐదు ట్రాక్టర్లతో తీసుకెళ్లగా ఆర్‌బికె సిబ్బంది పూర్తి తేమశాతం ఉన్నట్టు గుర్తించారు. కానీ, మిల్లు వద్దకు వెళ్లేసరికి ఒక ట్రాక్టర్ లోడుకి తేమ శాతం తక్కువగా ఉన్నట్టుగా చెప్పి ధర తగ్గించారు. ఇతను కూడా తనను కలిసిన ప్రజాశక్తి ఎదుట తీవ్రంగా విలపించాడు. కేవలం రామునాయుడు, చంద్రరావు మాత్రమే కాదు. జిల్లాలో 90శాతం రైతులది ఇదే వ్యథ. ప్రభుత్వానికి విక్రయిస్తే మిల్లర్లు అదనంగా ధాన్యం తీసుకుంటున్నారని, ప్రైవేటు వ్యాపారులకిస్తే రూ.200 తక్కువ ధరకు లాగేస్తున్నారని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

డిప్యూటీ తహశీల్దార్ కూడా అదనపు ధాన్యం ఇవ్వాల్సిందే అన్నారు...



ఏం చేస్తాం బాబు... మా బాధలు ఎవరికి చెప్పుకుంటాం... ఎవరికి చెప్పినా మా బాధలు, ఇబ్బందులు పట్టడం లేదు. డిప్యూటీ తహశీల్దార్‌కు చెబితే ఆయన కూడా అదనపు ధాన్యం ఇవ్వాల్సిందే అన్నారు...మురపాక సూర్యరాజా రైస్ మిల్లుకు 5,900 కేజీలు అప్పగించగా, 5,200కేజీలుగా నమోదు చేశారు. దీనిపై డిఎస్‌ఒకు ఫిర్యాదు చేస్తే ఆయన డిప్యూటీ తహశీల్దార్ వద్దకు పంపారు. ఆమె వచ్చి నాను న్యాయం చేయాల్సింది పోయి... అందరూ ఆలాగే ఇచ్చేస్తున్నారు... నువ్వు కూడా ఆలాగే ఇచ్చేయ్... ఎందుకొచ్చిన గోల అంటూ నన్నే వెనక్కితగించేందుకు ప్రయత్నించారు. కానీ, నేను మాత్రం అంగీకరించలేదు. కాబట్టి నా దగ్గర తీసుకున్న కేజీల మొత్తానికి బిల్లు ఇప్పించాలని అధికారులను కోరతున్నాను. ఈ మేరకు కలెక్టర్‌కు కూడా జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఫిర్యాదు చేశాను. ఆమె ఏమేరకు స్పందిస్తారో? చూడాలి.

భూమిరెడ్డి అప్పారావు
వసాది, గంట్యాడ మండలం



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఇందిర


అక్రమంగా అంగన్వాడీలపై ప్రయోగించిన

ఎస్మాను వెంటనే రద్దు చేయాలి

రౌండ్‌టేబుల్ సమావేశంలో అఖిలపక్ష నాయకులు డిమాండ్

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

అంగన్వాడీలపై అక్రమంగా ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని వెంటనే ఉపసంహరించి, వారి సమస్యలను పరిష్కరించాలని అఖిలపక్ష పార్టీల నేతలు, ప్రజా సంఘాల నాయకులు ముఖ్యకంఠంతో డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీవో హోంలో సిపిఎం ఆధ్వర్యంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గొర్లి వెంకటరమణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు, వివిధ ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చాలా మొండిగా, దుర్మార్గంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. 31 రోజు నుంచి సమ్మె చేస్తున్న అంగన్వాడీల సమస్యలు పరిష్కరించకుండా సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయమని అడిగినందుకు అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురి చేయడానికి 27 రోజుల తర్వాత అంగన్వాడీలు అత్యవసర సేవలు విభాగంలోకి వస్తారని చెప్పి ఎస్మా జీవో 2ను తీసుకొచ్చి నోటీసులు ఇచ్చి పచ్చి దుర్మార్గంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. అంగనవాడీ సేవలు అత్యవసర విభాగాలకు రావని, ఆ మాత్రం రాష్ట్ర ప్రభుత్వానికి తెలియకపోవడం దారుణమన్నారు. కేంద్ర బిజెపి అనుసరిస్తున్న ఫాసిస్టు విధానాలనే రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తుందని, ఇలాంటి చర్యల వల్ల రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇప్పటికైనా సమగ్ర శిక్ష, మున్సిపల్ ఉద్యోగుల సమస్యలు చర్చల ద్వారా పరిష్కరించినట్లు అంగన్‌వాడీలను కూడా చర్చలకు పిలిచి సమస్యలు పరిష్కరించేలా ప్రభుత్వం చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం అంగన్వాడీల సమస్య పరిష్కరించకపోతే సంక్రాంతి తర్వాత రాష్ట్ర బందును జయప్రదం చేయాలని, ఎస్మా, షోకాజ్ నోటీసులు వెనక్కి తీసుకోవాలని తీర్మానించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు వి.ఇందిర, సిపిఐ జిల్లా కార్యదర్శి కోరంగి మన్మధరావు, అంగన్వాడీ నాయకులు జి.జ్యోతి, గౌరి, మణి, రైతు కూలీ సంఘం నాయకులు శ్రీను నాయుడు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ బి.నరసింగరావు, సిపిఐ ఎంఎల్ జిల్లా నాయకులు ఎం.బాషా. గిరిజనసంక్షేమ సంఘం నాయకులు రంజిత్ కుమార్, ప్రగతి మహిళా సంఘం నాయకులు పి.రమణి, మానవ హక్కుల సంఘం నాయకులు వి దాలినాయుడు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకులు, ఎఐవైఎఫ్ గోపి నాయుడు, రైతు సంఘం నాయకులు బి.దాసు, గిరిజన సంఘం నాయకులు రామస్వామి. ఐద్వాజిల్లా కార్యదర్శి ఆర్.శ్రీదేవి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.000



లబ్ధిదారుకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

7460 మంది లబ్ధిదారులకు జగనన్న తోడు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో 7460 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ.7.59 కోట్లు జగనన్న తోడు నగదు జమ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన క్యాంపు కార్యాలయం నుంచి బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు నగదు జమ చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్థానిక కలెక్టర్ కార్యాలయం నుంచి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిరు వ్యాపారులు ఇతరులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా స్వయం ఉపాధి వృద్ధి చెందేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తూ అధిక వడ్డీల బారిన పడకుండా వరుసగా 8వ విడత జగనన్న తోడు పథకం కింద ఒక్కొక్కరికి రూ.10వేలు, అంతకుపైన రూ.13 వేలు వరకు వడ్డీ లేని రుణాలతో ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. సకాలంలో రుణాలు చెల్లించిన చిరు వ్యాపారులు బ్యాంకులకు చెల్లించిన వడ్డీని ఆరు నెలలకోసారి ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తోందని తెలిపారు. జగనన్న తోడును సద్వినియోగం చేసుకొని జీవన వికాసానికి దోహదపడాలని అన్నారు. అనంతరం నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ తదితరులు పాల్గొన్నారు.

చెక్ పోస్టులు సమర్ధవంతంగా పనిచేయాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో సిఎస్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాల్లో గల చెక్ పోస్టులు సమర్ధవంతంగా పనిచేసేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్ రెడ్డి ఆదేశించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గురువారం జిల్లా కలెక్టర్లతో పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు, ప్రాధాన్యతా భవనాలు, జగనన్న ఆరోగ్య సురక్ష తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు రానున్న తరుణంలో వాటి పనితీరుపై దృష్టి సారించాలన్నారు. అక్రమ రవాణా జరిగే అంశాల పట్ల దృష్టి సారించాలన్నారు. పోలింగ్ కేంద్రాలు గల పాఠశాలలకు ర్యాంపులు ఉండేలా చూడాలని, తాగునీరు, ఇతర సౌకర్యాల లభ్యతను పరిశీలించాలని ఆదేశించారు. పిఎం జన్‌మాన్ కార్యక్రమం కింద సర్వే త్వరగా పూర్తి చేయాలని సూచించారు. గృహ నిర్మాణ లక్ష్యాలు పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 201 కేంద్రాల్లో సౌకర్యాలు ముఖ్యంగా ర్యాంపులు, మరుగుదొడ్లు అవసరమని గుర్తించామని, ఇప్పటికే వంద కేంద్రాల్లో పూర్తి చేశామని తెలిపారు. మిగిలిన వాటిలో ఈ నెల 25 నాటికి పూర్తి చేస్తామని వివరించారు. జిల్లాలో ప్రాధాన్యత భవనాలను వచ్చే పది రోజులలో గరిష్ఠంగా ప్రారంభించేందుకు అన్ని చర్యలు చేపట్టామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎంవిఆర్ కృష్ణాజీ, డిఎంహెచ్ఒ బి.జగన్నాథరావు, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, హౌసింగ్ ఇన్ ఛార్జ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.రమేష్, డిఇఒ ఎన్. ప్రేమ్ కుమార్, ఐసిడిఎస్ పీడీ ఎం ఎన్ రాణి, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని అన్ని ఎరువుల దుకాణాల్లో రైతులుకు అవసరమైన అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని బూర్జ, సీతానగరంలోని పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల స్టాక్ దస్త్రాలను పరిశీలించారు. స్టాక్ రికార్డులు ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలన్నారు. అలాగే స్టాక్ నిల్వలు తెలిసేలా బ్లాక్ బోర్డు పైన స్టాక్ వివరాలు పొందుపర్చాలని సూచించారు. మండలంలో ఎరువుల కొరత లేకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని, కావున రైతులు అందుబాటులో ఉన్న ఎరువులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఎఎలు పాల్గొన్నారు.

మన్యంలో సంక్రాంతి శోభ

కొనుగోలుదారులతో సంతల్లో సందడి

ప్రజాశక్తి - కురుపాం


పచ్చని పొలాలు.. కళ్లాల్లో పండిన పంటలు... తల్లిదండ్రులు, అన్నదమ్ములు, అక్కచెల్లెల్ల ఆప్యాయతా అనురాగాలు.. ఉన్నంతలో కలిసిమెలిసి సాగే జీవనం.. ఒక్కమాటలో చెప్పాలంటే పల్లెలోగిలికి కుటుంబమే ఆభరణం.. ఇదీ మన పల్లె ఖ్యాతి.. కానీ పల్లెల్లో ఇప్పుడు ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. వీధుల్లో తాళం వేసిన ఇళ్లు... చెట్ల కింద వృద్ధుల నిరీక్షణ.. ఏవైనా పండగలు వస్తే తప్ప పల్లెల్లో కళ లేకుండా పోయింది. సొంతూరిని, కన్నవారిని కులసుకొనేలా 'సంక్రాంతి పండగ తెచ్చింది. పిల్లలంతా బతుకు తెరువుకు పట్టణాలకు పోతే ఇంటివద్ద నిరీక్షిస్తున్న ముసలి ప్రాణాలకు మళ్లీ వీరి రాకతో గ్రామాల్లో ప్రేమబంధాలు వెల్లివిరుస్తున్నాయి. గ్రామాల్లో చేసేందుకు పనిలేక పొట్టకూటి కోసం ఊరు విడిచి సుదూర ప్రాంతాలకు వలస వెళ్లిన కార్మికులు సంక్రాంతి పండగకు చేరుకుంటున్నారు. వలసలు పోవడంతో నిన్నటివరకు జనసంచారమే లేక గ్రామాల్లో ఇళ్లకు తాళాలు వేసి బోసి పోయిన గ్రామాలు నేడు జనంతో సందడిగా కనిపిస్తున్నాయి. వలసలతో ఆత్మీయ బంధాలతో పాటు బాల్యం కనుమరుగై పోగా అక్కున చేర్చుకునే అలనా, పాలనా కరువై అష్టకష్టాలుపడుతున్న చిన్నారులకు మరో పది రోజుల పాటు తల్లిదండ్రుల ప్రేమానురాగాలను పొందనున్నారు. సంక్రాంతి పెద్ద పండగ కావడంతో ఉపాధి, ఉద్యోగాలు, వివిధ పనుల్లో ఇతర ప్రాంతాల్లో ఉన్నవారు స్వగ్రామాలకు తిరిగి వస్తున్నారు. ఆరు నెలలుగా సంపాదించిన సొమ్ముతో ఇళ్లకు సున్నాలు వేసి, కొత్త దుస్తులు కొనుక్కొని సంక్రాంతి పండగను ఆనందంగా జరుపుకోనున్నారు. మండలం కేంద్రంలో బస్సుల నుంచి దిగే కూలీలే గత వారం రోజులుగా కనిపిస్తున్నారు.



కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న కురుపాం సంత

మన్యం సంతకు సంక్రాంతి శోభ

మండల కేంద్రంలో జరిగే వారపు సంతకు సంక్రాంతి శోభ సంతరించుకుంది. వారపు సంతలో కొత్తబట్టలు కొనుగోలుదారులతో బట్టల దుకాణాలు కిటకిటలాడాయి. మండల కేంద్రంలో గురువారం జరిగిన వారపు సంతకు భోగి పండుగకు రెండు రోజులు ముందు కావడంతో మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గిరిజనులు క్రయవిక్రయాలు జరిపారు. మన్యం ప్రాంతంలో గిరిజనులు అన్ని అవసరాలకు వారపు సంతపైనే ఆధారపడతారు. మైదాన ప్రాంతానికి వెళ్లి కొనుగోలు చేయాలంటే ఆర్థిక భారం గనుక అందుబాటులో ఉన్న వారపు సంతలను ఆశ్రయిస్తారు. సంక్రాంతి పండగ అంటేనే ఆచార సాంప్రదాయాలతో కూడిన పండగ. గిరిజన రైతులు పండించిన, సేకరించిన వాణిజ్య పంటలైన చిక్కుళ్లు, ఎర్ర కందులు, తెల్లకందులు, పసుపు, పిప్పళ్లు, గుమ్మడి కాయలు, కొండ చీపుర్లు, కరక్కాయలు వంటి అటవీ ఉత్పత్తులను సేకరించి ఆదాయాన్ని సమకూర్చుకొని పండగ అవసరాలు తీర్చుకుంటున్నారు. పండుగకు ఇంటికి ఎవరు వచ్చినా మద్యం ఇస్తారు. అదే గిరిజనుల ఆచారం సంక్రాంతి పండుగ శోభతో వారపు సంతల్లోనూ, గ్రామాలన్నీ కళకళలాడుతున్నాయి.



పాలకొండ నగర పంచాయతీలో భవనాలు

భవనం ఆస్తి విలువ రూ.50వేలే!

సాల్వెన్స్ సర్టిఫికెట్ కోసం నగరపంచాయతీలో వాసుల అవస్థలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగరపంచాయితీ పరిధిలో ఎంత విలువైన భవంతి ఉన్నా కూడా దాని విలువ రూ.50వేలు మాత్రమే. చుట్టు పక్కల గ్రామాల్లో కూడా లక్షలాది రూపాయల విలువ ఉన్నప్పటికీ కూడా నగరపంచాయితీ అధికారులు మాత్రం అస్తి విలువ రూ.50వేలు మాత్రమే అని చెప్పడం విడ్డూరం. పట్టణంలో నిర్మాణమైన భవనం మార్కెట్ విలువ చదరపు అడుగు రూ.2500 వరకు ఉంది. ఈ లెక్కన అయితే వెయ్యి చదరపు అడుగుల భవనం రూ.25లక్షల వరకూ ఉంటుంది. అయితే నగర పంచాయతీ అధికారులు మాత్రమే రూ.50వేలు మాత్రమే ఇవ్వడం పట్ల పట్టణ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీకి ఆనుకొని కొండాపురం, తుమరాడ గ్రామపంచాయతీలో ఇంటి విలువ సుమారు లక్ష రూపాయల వరకు ఇస్తున్నారు. అయితే నగర పంచాయతీలు రెండు అంతస్తుల భవంతి ఉన్నా కూడా దాని విలువ రూ.50వేలు మాత్రమేనని నగరపంచాయితీ అధికారులు అనడంతో సాల్వెన్సు సర్టిఫికెట్ కోసం వెళ్తున్న ప్రజలు ముక్కున వేలేసుకునే పరిస్థితి. అదేంటి అలా అని ప్రశ్నిస్తే ఇక్కడ ఇంతే. ఇంతకంటే ఎక్కువ విలువను చూపడం కుదరదు అని సమాధానం ఇవ్వడం కొసమెరుపు. చుట్టుపక్కల ఉన్న గ్రామాల్లో ఉన్న భవంతుల విలువతో పోల్చుకుంటే నగరపంచాయితీలో ఉన్న భవనాల యజమానులకు మాత్రం విలువ లేదా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. నగరపంచాయతీ ఉద్యోగుల నిర్వాకంతో కమిషనర్‌ను కూడా తప్పుదోవ పట్టిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇంటి పన్నులు లక్షల్లో వసూలు చేస్తున్న అధికారులు సాల్వెన్స్ సర్టిఫికెట్ ఇవ్వడానికి మాత్రం ఆస్తివిలువ తగ్గించి కేవలం రూ.50వేలకు మాత్రమే ఇవ్వగలమని చెప్పటంతో ప్రజల నుండి తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు పునరాలోచించి సాల్వెన్సీ సర్టిఫికెట్లకు ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు.

ఈ విషయమై నగరపంచాయతీ కమిషనర్ సర్వేశ్వరరావును వివరణ కోరగా, నగరపంచాయితీ పరిధిలో యాభై వేలకు మాత్రమే సాలవెన్స్ సర్టిఫికెట్ ఇవ్వగలం. అంతకు మించి ఇచ్చే అధికారం తమకు లేదని చెప్పారు.

బాబు మాయ మాటలు నమ్మొద్దు : రాజన్నదొర

ప్రజాశక్తి - మక్కువ

రాష్ట్ర ప్రభుత్వంపై నిత్యం బురదజల్లుతూ చంద్రబాబు చేస్తున్న ప్రసంగాలు, మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర అన్నారు. స్థానిక తహశీల్దార్ సూర్యనారాయణ అధ్యక్షతన మండలంలో ఫ్రీ హోల్డ్ పట్టాలు పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజన్నదొర మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం 14 ఏళ్లు కొనసాగిందని, ఆ సమయంలో చంద్రబాబు నాయుడు చేయలేని స్వర్ణాంధ్ర ఇప్పుడు ఎలా చేస్తారని ఆయన ఎద్దేవా చేశారు. అధికారంలోకి రావడానికి చెప్పే మాయ మాటలు తప్ప ఇంకేమీ లేదన్నారు. కావున ప్రజలు ఇలాంటి మాటలు నమ్మిమోసపోవద్దని ప్రజలను కోరారు. సాలూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమని పలుమార్లు టిడిపి నాయకులకు సవాల్ విసిరినప్పటికీ ఎవరూ ముందుకు రాకుండా ఉనికి కోసం విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మండలంలో 733 మంది లబ్ధిదారులకు 712 ఎకరాల భూమికి హక్కులు కల్పిస్తూ పత్రాలను అందజేశారు



లబ్ధిదారులకు భూపట్టాలు పంపిణీ చేసిన డిప్యూటీ సిఎం రాజన్నదొర


రెండున్నర రోజులు సచివాలయాలకు పరిమితమయ్యాం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని వినియోగించుకుని ప్రతి సచివాలయంలో రెండున్నర రోజులు ప్రజలతో గడిపామని డిప్యూటీ సీఎం రాజన్న దొర అన్నారు. 211 రోజుల పాటు కొనసాగిన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ముగింపు సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. సచివాలయానికి ప్రభుత్వం తరపున రూ.20 లక్షలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు మావుడి రంగునాయుడు, ఎంపిపి మర్రి పారమ్మ, ఎంపిడిఒ సూర్యనారాయణ, ఇఒపిఆర్‌డి దేవకుమార్, ఎస్సీ సొసైటీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఇఒపిఆర్‌డిల సంఘం జిల్లా అధ్యక్షునిగా రమేష్‌బాబు

ప్రజాశక్తి - కురుపాం :

ఇఒపిఆర్‌డిల జిల్లా నూతన కార్యవర్గం గురువారం ఎన్నికైంది. మండలంలోని ఇఒపిఆర్‌డిగా విధులు నిర్వహిస్తున్న జి.రమేష్‌బాబును జిల్లా అధ్యక్షునిగా, ప్రధాన కార్యదర్శిగా సీతంపేట ఇఒపిఆర్‌డి కె.సత్యం, కొమరాడ ఇఒపిఆర్‌డి ఎం.రాధాకృష్ణ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమపై నమ్మకం ఉంచి వివిధ హోదాల్లో పదవులు కల్పించినందుకు వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాలో అందరు ఇఒపిఆర్‌డిలను కలుపుకొని హక్కుల సాధనకు కలిసి పని చేస్తూ అందరిని కలుపుకుంటూ వెళ్తామని అన్నారు.





లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ చైతన్యప్రవంతి

కొత్త పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట సచివాలయంలో కొత్తగా మంజూరైన పింఛన్లను సర్పంచి రామ సామంతుల చైతన్య ప్రవంతి చేతులు మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రతి పేదవానికి అండగా ఉండాలనే ఉద్దేశంతో రూ.2750 పింఛన్ రూ.3000కు పెంచిన ఘనత ఒక్క ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో చెముడుగూడ ఎంపిటిసి మండంగి రమణ, పంచాయతీ కార్యదర్శులు శ్యామల, కుమార్ సచివాలయం సిబ్బంది, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు

ప్రజాశక్తి - సాలూరు

జన్ భగీరధ్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. మక్కువ, సాలూరు, పాచిపెంట ఎంఇఒలు పెంట సత్యనారాయణ, రాజ్‌కుమార్, పి.జోగారావు పర్యవేక్షణలో పై మూడు మండలాలకు చెందిన విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. సీనియర్ సహాయకులు కెవి సత్యనారాయణ పాల్గొన్నారు.

16 వరకు లైఫ్ టైమ్ సర్టిఫికెట్లు చేయబడవు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఈనెల 13నుంచి 16 వరకు స్థానిక సబ్ ట్రెజరరీ పరిధిలో గల ప్రభుత్వ విశ్రాంత పింఛనుదారుల లైఫ్ టైం సర్టిఫికెట్లు పెన్షన్ దారుల సమావేశం మందిరంలో చేయడం జరగదని పెన్షన్‌దారుల సంఘం ప్రధాన కార్యదర్శి డి.గణపతిరావు తెలిపారు. కావున పెన్షన్‌దారులెవరూ రావొద్దని ఈ విషయాన్ని రిటైర్డ్ పెన్షన్‌దారులంతా గమనించాలని కోరారు.

చిట్టపూడి వలసలో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని చిట్టపూడివలసలో గురువారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రదీప్ రోగులకు తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి పవిత్ర, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.



అంధురాలికి ఆర్థిక సాయం అందజేస్తున్న శ్రేయ సంస్థ అధ్యక్షులు పెంటయ్య

అంధులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పులిపుట్టి పంచాయతీలో గల భారతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా భారతి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు భోగి మంటలు వేశారు. సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి ప్రాముఖ్యత గురించి మున్సిపల్ వివరించారు. ఈ మేరకు పాఠశాల యాజమాన్యం అంధులకు రూ.15వేలు శ్రీ వాల్మీకి వనవాసి శ్రేయ సంస్థ అధ్యక్షులు పెంటయ్య చేతులు మీదుగా ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో వాల్మీకి వనవాసి శ్రేయ సంస్థ అధ్యక్షులు ఎస్పీ పెంటయ్య, ప్రిన్సిపల్ ఎస్.నవీన్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్తలకు ధన్యవాదాలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

బొబ్బిలిలో గురువారం నిర్వహించిన రా కదలిరా కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కురుపాం నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి తెలిపారు. గుమ్మలక్ష్మీపురంలోని తన నివాసం వద్ద గురువారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రా కదలిరా కార్యక్రమం విజయవంతంతో టిడిపి నాయకులు, కార్యకర్తల్లో జోష్ పెరిగిందన్నారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. 2024 ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గంలో టిడిపి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.



సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి - సాలూరు

పట్టణంలోని శ్రీ సత్యసాయి జూనియర్, డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాశాల ఆవరణలో సంక్రాంతి ముగ్గులు వేసి సాంప్రదాయ దుస్తులతో అలరించారు. డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు భాస్కరరావు, ప్రసాదరావు, డైరెక్టర్ నాగమణి, సత్యనారాయణ పర్యవేక్షణలో నిర్వహించారు.

చిన్నబొండపల్లి లేగదూడల ప్రదర్శన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని చిన్నబొండపల్లిలో గురువారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో లేగదూడల ప్రదర్శన జరిగింది. పరిసర గ్రామాలకు చెందిన రైతులు లేగ దూడలు ప్రదర్శించారు. ఇందులో కుడితి నాగభూషణ దూడకు మొదటి బహుమతి, కోట శివునాయుడుకు చెందిన దూడకు ద్వితీయ బహుమతి, మిర్యాల జగన్నాధం దూడకు తృతీయ బహుమతి పొందినట్లుగా అధికారులు ప్రకటించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పశు రైతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పశువైద్యధికారులు రమేష్, జగదీష్, జైకిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.



పాడిరైతుకు బహుమతి అందజేస్తున్న పశువైద్య అధికారులు

ఓట్లేసి తప్పుచేశామని లెంపలేసుకుంటూ

అంగన్‌వాడీల నిరసనలు

31వ రోజుకు చేరిన సమ్మె

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీల సమ్మె 31వ రోజుకు చేరుకున్నది. గురువారం అంగన్వాడీ కార్యకర్తలంతా జగన్మోహన్‌రెడ్డికి ఓట్లు వేసి తప్పు చేశామని తమ చెంపలు కొట్టుకుంటూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు సునీత, ఆర్.లక్ష్మి, ఎస్.అరుణ, పి.పద్మ, సిఐటియు నాయకులు జి.వెంకటరమణ, వై.రామారావు పాల్గొన్నారు.

సాలూరు : అంగన్వాడీల సమ్మె గురువారం 31రోజుకు చేరింది. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మెలో భాగంగా 31 సంఖ్య రూపంలో కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎ.నారాయణమ్మ, శశికళ మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించేంత వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు. గతంలో సిఎం జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు తిరుపతమ్మ, సుభద్ర అరుణ కుమారి పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఐటిడిఎ ఎదుట అంగన్‌వాడీల నిరవధిక సమ్మె కొనసాగింది. సిఐటియు మండల కార్యదర్శి ఎం.కాంతారావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చులకనగా చూడటమే కాకుండా ఎస్మాను ఉపయోగించి, అధికారుల ద్వారా నోటీసులు జారీ చేయించి, భయానక వాతావరణం కల్పిస్తున్నారన్నారు. ప్రభుత్వం దిగి వస్తే గౌరవం ఉంటుందని, లేకుంటే అథఃపాతాళానికి పోక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కమిటీ అధ్యక్ష కార్యదర్శులు ఎ.పార్వతి, ఎ.దర్శమి అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండల కేంద్రంలో సమ్మె శిబిరం వద్ద అంగన్‌వాడీలు ఒంటి కాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బివి రమణ మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్వాడీల పట్ల నిర్బంధాన్ని ప్రయోగించడం దుర్మార్గమైన చర్య అని విమ ర్శించారు. ఇప్పటికైనా అంగన్వాడీల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని, లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు మర్రాపు సావిత్రి, పద్మ, అచ్చియ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : అంగన్వాడీలు సిఎం జగన్ చిత్రపటం వద్ద మోకారిల్లి రోదనలు వినిపించారు. 31వ రోజు ఆకారంలో కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు సత్యవతి, కస్తూరి మాట్లాడుతూ సమ్మె తలపెట్టిన నెలరోజులు దాటినా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమ సమస్యలపై స్పందించి పరిష్కార మార్గం చూపకపోవడం దారుణమన్నారు. మండలంలో పలు అంగన్వాడీ కేంద్రాల్లో నోటీసులు అంటించిన ప్రభుత్వం బెదిరింపులకు పాల్పడుతుందన్నారు. బెదిరింపులకు లొంగకుండా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని అంగన్‌వాడీలు కరాకండీగా తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కోలక అవినాష్, మండంగి రమణ పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా స్థానిక కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరాహారదీక్ష 31వ రోజు కొనసాగింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు, కోశాదికారి గొర్లి వెంకటరమణ, ఉపాధ్యక్షులు వి.ఇందిర, పట్టణ నాయకులు బొత్స లక్ష్మి, సమ్మె శిబిరం దగ్గర యూనియన్ జిల్లా కార్యదర్శి గంటా జ్యోతి, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావు మద్దతుగా ప్రసంగించారు. శిబిరంలో వివిధ మండలాల నుంచి వచ్చిన యూనియన్ నాయకులు పాటలు పాడుతు ఉత్సాహంగా సమ్మె కొనసాగించారు.




ఎంఆర్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద నోటీసు అతికిస్తున్న ఐసిడిఎస్ అధికారులు

అంగన్వాడీ కేంద్రాలకు షోకాజ్ నోటీసులు

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

పది రోజుల్లోగా విధుల్లోకి చేరాలని అంగన్వాడీ కేంద్రాల బాధ్యులకు నోటీసులు పంపిస్తున్నట్లు స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని ఎమ్మార్ నగరం అంగన్వాడీ కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు పరిధిలోని 120 కేంద్రాల్లో పనిచేస్తున్న కార్యకర్తలు పది రోజుల్లో విధుల్లోకి చేరాలని వ్యక్తిగతంగానూ, కేంద్రాలకు నోటీసులు పంపిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు అంగన్వాడీ కేంద్రం నిర్వహిస్తున్న వాలంటీర్లతో కలిసి నోటీసులు అంటించారు.



సీతానగరంలో లెంపలేసుకొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



సాలూరులో 31వ వరోజు ఆకృతిలో అంగన్‌వాడీలు



ప్రభుత్వం మొద్దునిద్ర వీడాలని నిద్రపోతూ నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

బెల్లాన భవితవ్యం ఏమిటో?

ఎంపీ సీటు ఆశించవద్దన్న అధిష్టానం
ఎమ్మెల్సీ లేదా జెడ్‌పి పీఠం ఇస్తామని హామీ!

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



విజయనగరం ఎంపి బెల్లాన చంద్రశేఖర్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ సారి ఎంపి సీటు వదులుకోవాలంటూ నాలుగు రోజుల క్రితమే నేరుగా ఆదిష్టానం తేల్చి చెప్పినట్టు సమాచారం. ఈసారికి పార్టీ కోసం పనిచేయాలని, తిరిగి అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ లేదా ఏదైనా పదవి కట్టబెడతామని హామీ ఇచ్చినట్టుగా తెలుస్తోంది. దీంతో, ఆ రోజు నుంచి బెల్లాన మౌనంగా ఉంటున్నారు. మరోవైపు మంత్రి బొత్స కూడా బెల్లానను వీలైనంత వరకు ఎచ్చెర్ల నుంచి అవకాశం కల్పించేటట్టు చూస్తున్నారని, అదీ కాకపోతే విజయనగరం ఎంపీగా మజ్జి శ్రీనివాసరావు వెళ్తే జిల్లా పరిషత్ చైర్మన్ పదవి కట్టబెట్టడం వంటి ఆలోచన చేస్తున్నారని రాజకీయ నాయకులు విశ్లేషిస్తున్నారు. బొత్స ప్రయత్నం ఎంత వరకు ఫలిస్తుందో చూడాల్సివుంది. ఎచ్చెర్లలో అవకాశం ఇవ్వడం లేదా ఇవ్వకపోవడం అనేది పూర్తిగా అధినేత జగన్ మనసులో మాటేనని, ఆ నియోజకవర్గం విజయనగరం జిల్లాలో లేదు కాబట్టి బొత్స చెప్తే అయ్యే పరిస్థితి లేదని కూడా కొంతమంది వ్యాఖ్యానిస్తున్నారు. ఈనేపథ్యంలో ఎన్నికల ముందు బెల్లాన ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో అన్న ఆశక్తికర చర్చ నడుస్తోంది. బెల్లానకు చీపురుపల్లి నియోజకవర్గంలో మంచి పట్టుంది. అందుకే వైసిపి మొదటి ఎన్నికల్లో మంత్రి బొత్స, మాజీ మంత్రి కిమిడి మృణాళినిపై నుంచి పోటీచేశారు. అంతకు ముందు జిల్లా పరిషత్ చైర్మన్‌గా కూడా పనిచేశారు. తిరిగి గత ఎన్నికల్లో బొత్స వైసిపిలోకి రావడంతో వైసిపి అధిష్టానం బెల్లానను పార్లమెంట్ స్థానానికి పంపింది. దీంతో, బొత్స విజయం కూడా సునాయాశమైంది. ఈసారి బెల్లానకు రాజకీయ భవిష్యత్తు చూపకుండా బొత్స ఎన్నికల్లో దిగితే పరిమాణాలు ఎలా ఉంటాయో అన్న ఆశక్తికరమైన చర్చ కూడా నడుస్తోంది. ఈనేపథ్యంలో ఒక వేళ జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు పార్లమెంట్ స్థానం నుంచి పోటీకి దిగితే ఆస్థానం బెల్లానకు కట్టబెట్టాలని బలంగా ఆలోచిస్తున్నట్టుగా చర్చ నడుస్తోంది. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్టుగా బెల్లానకు అలా సాయపడితే ఎన్నికల్లో బొత్స సునాయాశంగా ఒడ్డు ఎక్కడంతోపాటు జిల్లాపై మజ్జి శ్రీనివాసరావు హవాకు అడ్డుకట్టవేసినట్టుగా కూడా ఉంటుందని భావిస్తున్నట్టు సమాచారం. మరోవైపు ఎచ్చెర్ల నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌కు టిక్కెట్ ఉంటుందా? ఊడుతుందా? అన్న సందేహాలు సాగుతున్నాయి. ఈనేపథ్యంలో బెల్లానకు ఆ సీటు కోసం బొత్స ప్రయత్నాలు చేస్తున్నట్టుగా చర్చ నడుస్తోంది.

ఇవిఎంలపై అవగాహన

ప్రజాశక్తి - వీరఘట్టం

మండల కేంద్రంలోని పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో గురువారం స్థానిక తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ పర్యవేక్షణలో ఇవిఎంలపై ఓటర్లకు అవగాహన కల్పించారు. ఓటు ఏ విధంగా వేయాలన్నది ఇవిఎంల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు కుమారస్వామి, విఆర్‌ఒలు సురేష్, అప్పలనాయుడు, ఎల్లయ్య , తదితరులు పాల్గొన్నారు.



వీరఘట్టంలో కబడ్డీ ఆడుతున్న బాలికలు

కొనసాగుతున్న క్రీడా పోటీలు

ప్రజాశక్తి - వీరఘట్టం

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో గురువారం ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. స్థానిక ఎంపిడిఒ డి.శ్వేత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా బాలుర, బాలికల కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.ఉమామహేశ్వరరావు, ఎం.రామకృష్ణ, ఎస్ పద్మరాజు, కె.సాల్మన్‌రాజు, వి.రాజేంద్ర, భాస్కరరావు, టి.మధు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : స్థానిక ఎన్టీయార్ గ్రీన్‌ఫీల్డ్ స్టేడియంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ఈ పోటీల్లో ధారపాడు, కుడ్డపల్లి, మర్రిపాడు, హడ్డుబంగి తదితర పంచాయతీలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ తదితర క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపిడిఒ కె.గీతాంజలి పర్యవేక్షించారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందుల్లేకుండా క్రీడాకారులకు అన్ని సదుపాయాలు కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు వై.పాపారావు, సిహెచ్.శ్యాంబాబు, కె.కామేశ్వరరావు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

పాడి రైతులు పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని సద్వి నియోగం చేసుకోవాలని మండలంలోని బురదవెంకటాపురం సర్పంచ్ బొత్స లక్ష్మి అన్నారు. మండలంలోని పెద్దూరు రైతు భరోసా కేంద్రం పరిధిలోని బురదవెంకటాపురంలో గురువారం జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మండల పశు సంవర్ధశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గాలికుంటు వ్యాధిటీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు ఒక్కటే మార్గమన్నా రు. ఈవ్యాధి నివారణకు సంబంధించి పశువులకు టీకాలు వేయడం ఎంతో ఉపయోగమన్నారు. అలాగే వ్యాధిసోకిన పాడి పశువుల్లో తగ్గేపాల ఉత్పత్తిని శాశ్వతంగా నివారించవచ్చున్నారు. కావున రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకో వాలని కోరారు. కార్యక్రమంలో పశు వైద్యసిబ్బంది ఎ.వెంకటి, తదితరులు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

150 పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు

కురుపాం : మండలంలోని గుమ్మ పంచాయతీ పరిధిలో గల బొత్తిలిలో గురువారం 150 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశు సంవర్ధశాఖ అధికారిని కె.శైలజ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పశు విజ్ఞానబడి కార్యక్రమంలో ప్రతి గ్రామంలో పశువులకు టీకాలు వేయడం జరుతుందన్నారు. అలాగే చలి కాలంలో పశువులు వ్యాధిల బారినపడకుండా ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ నరేంద్ర, గ్రామ వెటర్నరీ అసిస్టెంట్ ఉషారాణి, రైతులు పాల్గొన్నారు.

హడ్డుబంగిలో భవిష్యత్తు గ్యారంటీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి "బాబు షఉరిటీ -భవిష్యత్తు గ్యారంటీ " కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జయకృష్ణ మినీ మేనిఫెస్టో లోని సూపర్ సిక్స్ అంశాలును వివరిస్తూ ఖచ్చితంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా మళ్లీ చంద్రబాబునాయుడు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. రాష్ట్రంలో పరిపాలన సక్రమార్గంలో ఉండాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా మళ్లీ రావాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు సవర తోట మొఖలింగం, బీసీ సెల్ అధ్యక్షులు ఆర్.రంగనాథం, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, ఎస్సీ సెల్ అధ్యక్షులు గంట సుధ, మాజీ సర్పంచ్ బిడ్డిక ఆనందరావు, మూటక భరత్ రాజ్, మండంగి కుమార్, బిడ్డిక విశ్వనాథం, బిడ్డిక ప్రవీణ్ సాయి, పువ్వల భాస్కరరావు, బిడ్డిక ఉమాకాంత్ గ్రామస్తులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు జయకృష్ణ

మండలాల్లో వికసిత భారత్ సంకల్ప యాత్ర

ప్రజాశక్తి - బలిజిపేట, సీతానగరం, వీరఘట్టం, గరుగుబిల్లి

జిల్లాలో వికసిత భారత్ సంకల్ప యాత్ర ముమ్మరంగా సాగుతోంది. గురువారం సీతానగరం మండలం జనుమల్లువలస, గాదెలవలస, గరుగుబిల్లి మండలం చినగొడబ, వీరఘట్టం మండలం చిట్టిపూడి వలస గ్రామ పంచాయతీలు, బలిజిపేట మండలంలో పెదపెంకి, తుమరాడ గ్రామ పంచాయతీల్లో జరిగింది. వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా వివిధ విభాగాల నుంచి పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. వైద్య శిబిరాలు నిర్వహించి సాధారణ వైద్య పరీక్షలు మాత్రమే కాకుండా క్షయ, సికిల్ సెల్ ఎనీమియా వంటి వాటిని గుర్తించేందుకు వైద్య పరీక్షలు చేయడం జరుగుతోంది. ప్రధాన మంత్రి ఉజ్వల్ యోజన క్రింద నమోదు, వికసిత భారత్ సంకల్ప యాత్రలో భాగంగా స్థానికంగా ఏర్పాటు చేస్తున్న కార్యక్రమాల్లో గెలుపొందిన మహిళలకు, విద్యార్థులకు, క్రీడాకారులకు, కళాకారులకు గ్రామ సభలలో భాగంగా సత్కరించారు. డ్రోన్ ప్రదర్శనలు, స్వయం సహాయక సంఘాల ప్రదర్శనలు, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మంది రైతులతో ముఖాముఖి కార్యక్రమాలు ఇందులో భాగంగా జరిగాయి. అయుష్మాన్ కార్డులను పంచాయతీల్లో పంపిణీ చేశారు. ఈ యాత్రలో జిల్లా నోడల్ అధికారిగా వ్యవహరిస్తున్న బలివాడ సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, బ్యాంకర్లు, మండల అధికారులు పాల్గొన్నారు.

అదుపులోకి 8మంది పందెం రాయుళ్లు

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని సన్యాసిరాజు పేటలో కోడిపందేలు ఆడుతున్న 8మంది వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్టు ట్రైనీ డిఎస్‌పి అజీజ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండగ సమయంలో ఎవరైనా పందేలు నిర్వహించినా, పేకాట ఆడినట్టు సమాచారం వస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే బెల్ట్ షాప్‌లు నిర్వహించిన వారిని కూడా క్షమించేది లేదన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ అమ్మన్నరావు, సిబ్బంది పాల్గొన్నారు.

జయహో బిసి వాహనం ప్రారంభం

విజయనగరం కోట : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న జయహో బిసి కార్యక్రమం గురించి ప్రత్యేకంగా రూపొందించిన వాహనాన్ని గురువారం అశోక్ బంగ్లా టిడిపి కార్యాలయంలో పార్లమెంట్ పార్టీ అధ్యక్షులు కిమిడి నాగార్జున , నియోజకవర్గ ఇంచార్జ్ అదితి గజపతి రాజు ప్రారంభించారు.

పోక్సో కేసులో నిందితుడికి 21ఏళ్ల జైలు

విజయనగరం : జిల్లాలోని ఎల్.కోట పోలీసు స్టేషనులో 2019 సంవత్సరంలో నమోదైన పోక్సో కేసులో నిందితుడైన వేపాడ మండలం రామస్వామిపేట గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ గుడే కోటేశ్వరరావు (36)కు 21 సంవత్సరాలు కఠిన కారా శిక్ష విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి కె.నాగమణి గురువారం తీర్పు చెప్పారని ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. రామస్వామిపేటకు చెందిన నిందితుడు గుడే కోటేశ్వరరావు ఒక బాలికపై లైంగిక నేరంకు పాల్పడినట్లుగా బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో ఎల్.కోట పోలీసు స్టేషనులో 2019లో కేసు నమోదైంది. డిఎస్‌పి డి. సూర్య శ్రావణ్ కుమార్ దర్యాప్తు చేపట్టి, నిందితుడిని అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి 20ఏళ్ల జైలు శిక్ష, రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. అట్రాసిటీ చట్టం సెక్షన్ 3(1)(డబ్ల్యూ)(1) ప్రకారం నేరానికి పాల్పడినందుకు ఒక ఏడాది జైలు, రూ. 1000 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. పోక్సో కేసులో త్వరితగతిన నిందితుడికి శిక్ష పడే విధంగా వ్యవహరించిన దర్యాప్తు అధికారులు, ప్రాసిక్యూషన్ అధికారులను ఎస్‌పి ఈ సందర్భంగా అభినందించారు.